క్లుప్తంగా

అబాకస్‌తో విద్యార్థుల్లో మేధోశక్తి



బహుమతులతో విద్యార్థులు

రేణిగుంట: అబాకస్‌తో విద్యార్థుల్లో మేధోశక్తి పెంపొందుతుందని శ్రీసాయి స్కూల్ కరెస్పాండెంట్ సాయిరాం అన్నారు. రేణిగుంటలోని శ్రీసాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం అబాకస్ శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. గణితంపై ఉన్న భయం పోగొట్టేందుకు ధరణి అబాకస్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ధరణి అబాకస్ డైరెక్టర్ రవికుమార్, చైర్మన్ లావణ్య, మహేష్, లావణ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్ వాయిదా

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి అధ్యక్షతన ఆదివారం ఉదయం నిర్వహించనున్న మండల సర్వ సభ్య సమావేశం వాయిదా వేసినట్టు ఎంపీడీఓ త్రివిక్రమ్ రావు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శాసన సభ సమావేశాలకు హాజరవుతున్న నేపథ్యంలో ఈ నెల 26వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు చెప్పారు.

తప్పిన ప్రమాదం



చిన్న పాండూరు వద్ద లారీలో నుంచి కిందకు పడిన ఇనుప షీట్

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరులో శనివారం మధ్యాహ్నం సత్యవేడు వైపుగా వెళ్తున్న లారీ నుంచి పరిశ్రమలకు రవాణా అవుతున్న ఐరన్ షీట్(ఇనుపరేకు) ఒక్కసారిగా జారి కిందకు పడింది. ఆ సమయంలో రోడ్డు పక్కన ఎవరూ లేకపోవడం, అటువైపుగా వాహన రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నేడు ప్రదోష పూజలు

పిచ్చాటూరు: మండలంలోని సురుటపల్లి శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం త్రయోదశిని పురస్కరించుకొని ప్రదోష పూజలు నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్యలో ఆలయంలోని ప్రదోష మండపంలో కొలువు దీరిన నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేక పూజలు నిర్వహిస్తామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత



పథకాలపై వివరిస్తున్న కళాజాత బృందం

ఏర్పేడు: స్థానిక సహకార బ్యాంకులో ఖాతాదారులకు శనివారం ఆర్థిక అక్షరాస్యత, ప్రభుత్వ పథకాలపై కళాజాత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తక్కువ వడ్డీతో రుణాలు అందజేత, లాకర్ సౌకర్యం, డిపాజిట్లపై అధిక వడ్డీ, సహకార బంధు, ఇన్సూరెన్స్ తదితర పథకాలపై ఖాతాదారులకు పాటల రూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, సహకార బ్యాంకు మేనేజరు సురేష్‌బాబు, సీఈఓ వేమాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాకలో సర్పంచ్ గంగాధరం ఆధ్వర్యంలో శనివారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు, వర్షం, పిడుగుపాటుకు గ్రామంలోని సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. గ్రామస్తులు సమస్యను సర్పంచ్‌కు విన్నవించారు. ఆయన సమస్యను ఎస్పీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు పాత ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరొకటి అమర్చి సమస్యను పరిష్కరించారు.

వన్నెకుల క్షత్రియుల జోలికొస్తే సహించం

- వైఎస్సార్‌సీపీలోనే వన్నెకుల క్షత్రియులకు ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న వన్నెకుల క్షత్రియులు

శ్రీకాళహస్తి: వన్నెకుల క్షత్రియుల జోలికొస్తే సహించే ప్రసక్తే లేదని వన్నెకుల క్షత్రియ నాయకులు ముక్త కంఠంతో అన్నారు. శ్రీకాళహస్తిలో శనివారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏర్పేడులోని పోలింగ్‌బూత్‌లో వన్నెకుల క్షత్రియుడైన దాముపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాముకు మద్దతుగా నిలిచిన ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం గురించి కొందరు టీడీపీ నాయకులు మాట్లాడడం సిగ్గుమాలిన చర్య అన్నారు. 1982లో నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించినపుడు బీసీ కులాల్లో అత్యధికులైన వన్నెకుల క్షత్రియులే పార్టీకి అండగా ఉన్నారన్నారు. కుప్పం నుంచి శ్రీకాళహస్తి వరకు వన్నెకుల క్షత్రియులు అత్యధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. అయితే టీడీపీ మాత్రం వన్నెకుల క్షత్రియులకు ఉన్నత పదవులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వన్నెకుల క్షత్రియులను గుర్తించి డాక్టర్‌గా ఎందరికో ప్రాణదాత అయిన డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంకు ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వన్నెకుల క్షత్రియులకు ఎంతో గౌరవం కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ నాయకులు బుజ్జిరెడ్డి, కృష్ణారెడ్డి, తిరుమల రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, మధురెడ్డి, మునికృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, దీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియుల జోలికొస్తే సహించం

ఏర్పేడు: టీడీపీ నాయకులు వన్నెకుల క్షత్రియుల జోలికి వస్తే సహించబోమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాతవీరాపురంలో వన్నెకుల క్షత్రియులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ పోలింగ్ రోజున పాతవీరాపురం గ్రామానికి చెందిన వన్నెకుల క్షత్రియుడు దామోదరంరెడ్డిపై టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరచడం హేయమైన చర్య అని చెప్పారు. దాడిని ఖండించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంపై టీడీపీ నాయకులు అవాకులు చవాకులు పేలడం తగదన్నారు. కార్యక్రమంలో కిట్టు మేస్త్రి, లక్ష్మీపతి, మునిశేఖర్, మునికృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా గేటు

- పనులు ఆపేందుకు యత్నించిన గ్రామస్తులు



తహసీల్దారు జరీనాబేగంతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఏర్పేడు : మండలంలోని చిందేపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డుకు అడ్డంగా ఓ పరిశ్రమ యాజమాన్యం శనివారం గేటు ఏర్పాటు చేసింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్దసంఖ్యలో ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని గేటు పనులను అడ్డుకున్నారు. అక్కడే ఉన్న తహసీల్దార్ జరీనాబేగం, పోలీసులకు తమ సమస్యను వివరించారు. గేటు ఏర్పాటు చేస్తే రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని వాపోయారు. దీనిపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని విన్నవించారు. అయితే ఆందోళన చేస్తున్న గ్రామస్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని శ్రీకాళహస్తి, బుచ్చినాయుడుకండ్రిగ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గేటు పనులు పూర్తయిన తర్వాత వారిని విడుదల చేశారు.

జోరు వాన



కురుస్తున్న వర్షం

వరదయ్యపాళెం: మండలంలో 2 రోజులుగా జోరు వాన కురిసింది. వాతావరణం చల్లబడింది. శనివారం మధ్యాహ్నం గంట పాటు కురిసిన జోరు వానకు వరదయ్యపాళెంలో పురవీధులు జలమయమయ్యాయి. అయితే ఈ వర్షం వేరుశనగ రైతులకు ఊరటనిచ్చింది. ఎన్నడూ లేని విధంగా మార్చిలో కురుస్తున్న వర్షం వాతావరణంలో మార్పులకు నాంది పలుకుతుందన్న చర్చ మొదలైంది.

'సేవ్ ఆక్సిజన్' ఉచిత నర్సరీ ప్రారంభం





ఉచితంగా మొక్కలు అందజేస్తున్న సర్పంచ్ స్రవంతి, ఉచిత నర్సరీని ప్రారంభిస్తున్న సర్పంచ్ స్రవంతి

ఏర్పేడు: మండలంలోని కొత్తకాల్వలో సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సర్పంచ్ స్రవంతి ఉచిత నర్సరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవులు మాట్లాడుతూ పర్యావరణాన్ని పెంపొందించాలన్న సంకల్పంతో ఉచిత నర్సరీని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వలంటీర్‌ను నియమించి గ్రామాల్లో మొక్కలు నాటించి వాటిని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, సంధ్య, హేమలత, శంకర్, నాదమునిరెడ్డి, గిరినాయుడు, రామనాథరెడ్డి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీపాళెం రైతుల సమస్య పరిష్కరించండి



జాయింట్ కలెక్టర్ బాలాజీతో మాట్లాడుతున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: మండలంలోని జీపాళెం రైతుల సమస్యను పరిష్కరించాలని మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీకి విన్నవించారు. జీపాళెంలో 20 మంది రైతుల సాగులో ఉన్న పొలాలకు పట్టాలు లేకపోవడంతో గత వరదల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు రైతులు విన్నవించారని గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సమస్యను పరిష్కారించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి సూచించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలకు మేరకు కలెక్టరేట్‌కు రైతులకు కలిసి వెళ్లిన బియ్యపు పవిత్రారెడ్డి అక్కడ జేసీ బాలాజీని కలసి రైతుల సమస్యను వివరించారు. అనంతరం భూములను సర్వే చేపట్టి రైతులకు త్వరలోనే పట్టాలు ఇస్తామని జేసీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, దాము, యోగేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, విజయభాస్కర్, లక్ష్మమ్మ, సుశీలమ్మ, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఈ గెలుపు బలుపు కాదు

పిచ్చాటూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో గెలుపును ప్రతిపక్ష టీడీపీ బలుపుగా భావిస్తోందని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ అన్నారు. పిచ్చాటూరులో శనివారం సాయంత్రం సుమన్ విలేకరులతో మాట్లాడుతూ గెలిచిన రెండు స్థానాలు అభ్యర్థుల వ్యక్తిగత సత్తాతో గెలిచినవే నన్నారు. ఇందులో టీడీపీ ప్రమేయం నామ మాత్రమే అని చెప్పారు. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తు కూడా బ్యాలెట్ పేపరులో లేదని చెప్పారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు సైనికుల్లా పనిచేసే సమయం ఆసన్నమైందని కేడర్‌ను ఆయన ఉత్తేజపరిచారు.

అకాల వర్షంతో పంట నష్టం



బుచ్చినాయుడుకండ్రిగలో నీట మునిగిన వరిధాన్యాన్ని తీస్తున్న రైతు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో భారీ నష్టం వాటిల్లింది. వరి, మిరప పంటలతోపాటు, మామిడి పూత దెబ్బతిన్నాయి. మండలంలోని పల్లమాల, కంచనపుత్తూరు, కుక్కంబాకం, జీఎన్‌కండ్రిగ, తహానగర్, కాటూరు, నీర్పాకోట, గాజులపెళ్లూరు, పెద్దపాలేడు, కనమనంబేడు గ్రామాల్లోని సుమారు 500 ఎకరాల్లోని వరిపంట నీట మునిగి పూర్తిగా దెబ్బతింది. అదే విధంగా 140 ఎకరాల్లోని మిరప పంట, 150 ఎకరాల్లోని మామిడి పూత దెబ్బతింది. చేతికి అందివచ్చిన వరిపంట భారీ వర్షానికి దెబ్బతినటంతో రైతులు లబోదిబోమంటున్నారు. వరిధాన్యం వర్షానికి తడిచి ముద్దయింది. దీంతో రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు.

పాయ్య గ్రామంలో వైద్యసేవలు



కాలనీలో మలాథిన్ స్ప్రే చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పాయ్య ఎస్సీ కాలనీలో శనివారం రెండవ రోజు కూడా వైద్యాధికారులు వైద్యశిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి డా.తేజేశ్వరి కాలనీలో జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు అందజేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శి చెంచయ్య ఆధ్వర్యంలో కాలనీలో మలాథిన్ స్ప్రే చేయించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యారులందరూ 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇంటి వద్ద విద్యార్థులను బాగా చదివించాలని, వారిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, విద్యా కమిటీ చైర్మన్ కుమార్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో తెలంగాణ మంత్రి



ఆలయ ధ్వజస్తంభం వద్ద తెలంగాణ మంత్రి సత్యవతి రాథోడ్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం తెలంగాణ మంత్రి సత్యవతి రాథోడ్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నో బ్యాగ్ డే



వస్తువులను తయారు చేస్తున్న విద్యార్థులు



ఆకర్షణీయంగా గీసిన డ్రాయింగ్

శ్రీకాళహస్తి రూరల్: సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాథమిక పాఠశాలల్లో మూడు నుంచి ఐదో తరగతి వరకు ఒకటి, మూడవ శనివారం విద్యార్థులకు నో బ్యాగ్ డే నిర్వహిస్తున్నట్లు చుక్కల నిడిగల్లు పాఠశాల హెచ్‌ఎం పుష్పకిరణ్ తెలిపారు. మూడవ శనివారం సందర్భంగా నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విద్యార్థులు చదువుల్లోనే కాకుండా వారిలో నైపుణ్యాలు పెంపొందించి ఆటపాటలు, బొమ్మలు గీయడం, తోటలు–మొక్కల పెంపకం, ఆవు పేడతో సేంద్రియ ఎరువులు తయారీ చేసి మొక్కలకు వేయడం, పాఠశాల ఆవరణలో శుభ్రంగా ఉంచుకోవడం తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తనిఖీ



గుడిమల్లంలో రికార్డులు పరిశీలిస్తున్న శాంతకుమారి

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం, మర్రిమంద, వికృతమాల గ్రామాల్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శాంత కుమారి తనిఖీ చేశారు. రికార్డులు, పిల్లల రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలకు అర్హులైన పిల్లలను ముందుగా గుర్తించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. సక్రమంగా వారికి టీకాలు వేయాలన్నారు. వందశాతం ఎమ్మార్ వ్యాక్సిన్ పూర్తి చేయాలన్నారు. అనంతరం గుడిమల్లం, వికృతమాల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఐరన్ సిరప్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాపానాయుడుపేట పీహెచ్‌సీ డాక్టర్ అభిజ్ఞ, హెల్త్ ఎడ్యుకేటర్ టాటాబాయి, సూపర్ వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ పనులు ప్రారంభం



జేసీబీతో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని తొట్టంబేడు పంచాయతీ రామచంద్రపురం గ్రామంలో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో డ్రైనేజీ కాలువలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఎక్కడ మురుగునీరు అక్కడే ఆగిపోయి దుర్గంధ భరితంగా మారేది. ఈ సమస్యపై గ్రామస్తులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, తొట్టంబేడు ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శి హంస ప్రకాష్, సర్పంచ్ సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులతో స్టెప్స్ సంస్థ నిర్వాహకులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పెద్దకన్నలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీకాళహస్తి స్టెప్స్ సంస్థ పథక సంచాలకులు డాక్టర్ ప్రమీళమ్మ ఆధ్వర్యంలో 61 మంది పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, జామెట్రీ బాక్స్, స్కేల్, పెన్సిళ్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పరీక్షలకు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంత వాతావరణంలో రాయటం వల్లమంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. పరీక్షల సమయంలో తేలికైన ఆహారం తీసుకోవడం, నూనె వస్తువులను తక్కువ తీసుకోవాలని, మంచినీరు బాగా తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం దామోదరం మాట్లాడుతూ స్టెప్స్ సంస్థకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, రమేష్, గాయత్రి, ఉపాధ్యాయులు మాధవయ్య, లక్ష్మిప్రసాద్, విజయలక్ష్మి, రాధాదేవి పాల్గొన్నారు.